నేను బతికుండగా రైతుబంధు ఆగుద్దా..!

- 30న ఓట్లుపడే... 3న కారు గెలిచే..6న డబ్బులు పడే..
- బిజెపికి ఓటు వేస్తే మోరీలో వేసినట్టే..
- అసైన్డ్ భూములకు పట్టాలపై తొలి సంతకం
- ప్రజా ఆశీర్వాద సభల్లో సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెసిఆర్ బతికుండగా రైతుబంధు ఆగుద్దా..? రైతుబంధు డబ్బులివ్వొద్దని కాంగ్రెసోళ్లు కుట్రలు చేసి ఆపింద్రు. న్యాయ పోరాటం చేస్తే 28న ఇచ్చేందుకు ఇసి అనుమతిచ్చింది. ఇంతలో మరో కాంగ్రెసోడు మళ్లీ ఫిర్యాదు చేసి ఆపింద్రు. ఇట్ల ఎన్ని రోజులు ఆపుతరు. 30న ఓట్లు పడుడేనాయే.. 3న కారు గెలుచుడేనాయే.. 6న రైతుబంధు డబ్బులిచ్చుడేనాయే.. దాంతోపాటు అసైన్డ్ భూములకు పట్టాల కోసం తొలి సతకం చేస్తా..' అని సిఎం కెసిఆర్ అన్నారు. సోమవారం సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

ఓటు మన తలరాతను మార్చుతుందని, వచ్చే ఐదేళ్లు మనందరి భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటేనని అందోల్, సంగారెడ్డి సభల్లో సిఎం చెప్పారు. పోటీ చేస్తున్న అభ్యర్థుల గుణగణాలతోపాటు ఆయా పార్టీల చరిత్రనూ చూడాలన్నారు.



ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సిఎం కెసిఆర్

రైతు బంధు దుబారా ఖర్చు అని చెబుతున్న కాంగ్రెసోళ్లు ఇసికి ఫిర్యాదు చేసి రైతులకు డబ్బులేయకుండా చేశారన్నారు. న్యాయ పోరాటం చేసి ఇసి అనుమతి తెచ్చుకుంటే మళ్లీ వాళ్లే ఫిర్యాదు చేసి డబ్బులివ్వకుండా అడ్డుకున్నారన్నారు. ఇట్ల ఎన్ని రోజులని రైతుబంధును ఆపుతారని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ గెల్వంగనే డిసెంబర్ 6న టింగ్ టింగ్‌మని రైతుల ఖాతాల్లో డబ్బులు పడతాయన్నారు. ఇందిరమ్మ రాజ్యం సక్కగుంటే ఎన్‌టిఆర్ పార్టీ ఎందుకు పట్టేవారని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రమంతా ప్రశాంతంగా ఉందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో సాగిన రక్తపాతం మళ్లీ కావాల్నా అని ప్రశ్నించారు.

దేశంలో 158 మెడికల్ కళాశాలిచ్చిన బిజెపి.. తెలంగాణకు ఒక్కటైనా ఇవ్వలేదన్నారు. అలాంటి బిజెపికి ఓటు ఎందుకు వేయాలన్నారు. బిజెపికి వేసే ఓటు మోరీలో వేసినట్లే అవుతుందన్నారు. సంగారెడ్డి జిల్లాలో తలాపున సింగూరున్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో అందోల్, సంగారెడ్డికి తాగు, సాగునీరు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. అందోల్ బిఆర్‌ఎస్ అభ్యర్థి క్రాంతిని గెలిపిస్తే నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టు కింద దళితులందరికీ ఒకేసారి దళితబంధు అమలు చేస్తామన్నారు. సంగారెడ్డిలో పోలింగ్ బూతుల్ని ఆక్రమించి రిగ్గింగ్ చేసే ఎమ్మెల్యే కావాల్నా ఓడిపోయినా ప్రజల మధ్య ఉండి సేవ చేస్తున్న చింత ప్రభాకర్ కావాల్నా ఆలోచించుకుని ఓటు వేయాలని కోరారు. సేవాలాల్ జయంతి రోజును సెలవు దినంగా ప్రకటిస్తామన్నారు.

అసైన్డ్ భూముల పట్టాలకు తొలి క్యాబినెట్‌లోనే ఆమోదం

అసైన్డ్ భూముల పట్టాలను రాబోయే బిఆర్‌ఎస్ ప్రభుత్వం తొలి క్యాబినెట్ భేటీలోనే ఆమోదిస్తామని షాద్‌నగర్, చేవెళ్ల సభల్లో ముఖ్యమంత్రి కెసిఆర్ స్పష్టం చేశారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ కోసమే పుట్టిన పార్టీ బిఆర్‌ఎస్ అని, అన్ని వర్గాల సంక్షేమాన్ని కాంక్షించే బిఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆదరించి గెలిపించాలని కోరారు. షాద్‌నగర్ వరకు మెట్రో విస్తరిస్తామన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్‌లో అనేక పరిశ్రమలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 111 జిఒ రద్దు చేశామని, హైదరాబాద్ చుట్టూ మాస్టర్ ప్లాన్ చేయాల్సి ఉందని, అదీ త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. 'నేను అందరికీ అర్డర్ వేస్తే.. ఎమ్మెల్యే కాలే యాదయ్య మాత్రం నాకు అర్డర్ వేస్తాడు. నా దగ్గరికి రాగానే ఏం ఆర్డరో చెప్పు అని అంటా' అని సిఎం వ్యాఖ్యానించారు.

బిజెపి, బిఆర్‌ఎస్ మిలాఖత్

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాధనాన్ని కొల్లగొడుతున్న బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలను ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ ప్రజలను కోరారు. ఎన్నికల్లో రూ. కోట్లు ఖర్చుపెట్టి, అనంతరం రూ.వందల కోట్లు సంపాదిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి, బిఆర్‌ఎస్ అంతర్గతంగా కుమ్మక్కయి ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ బూటకపు సెక్యులరిజంను అనుసరిస్తోందన్నారు. రాజకీయాలు ప్రజాసేవ కోసం కాకుండా వ్యాపారమయంగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో సిపిఎం ఇబ్రహీంపట్నం అభ్యర్థి పగడాల యాదయ్య తరపున సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఇబ్రహీంపట్నం చౌరస్తాలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు పెంచిన మోడీని గద్దెదింపాల్సిన అవసరం ఉందన్నారు. ఆ పార్టీ అభ్యర్థులను ఎన్నికల్లో తిరస్కరించాలని కోరారు. మోడీ హయాంలో పెట్టుబడిదారులకు రాయితీలు ఇచ్చి, పేద ప్రజలపై భారాలు మోపారని విమర్శించారు. ఛాయ్ అమ్మిన మోడీ, ప్రభుత్వ రంగ సంస్థలైన రైళ్లు, బొగ్గు, విమానాలు, ఒక్కటేమిటీ ఏది బడితే అది అమ్ముకుంటూ వస్తున్నారన్నారు. ప్రాజెక్టుల పేర తెలంగాణ సిఎం కెసిఆర్ రూ.లక్షల కోట్లు కొల్లగొట్టారన్నారు. బిజెపి, బిఆర్‌ఎస్ కలయికతో రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి. సామేల్ అధ్యక్షత వహించగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.జయలక్ష్మి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవిత మండల కార్యదర్శి జంగయ్య, పట్టణ కార్యదర్శి ఎల్లేశ్, నాయకులు వెంకటేశ్ తదితరులతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్లకు పంచేందుకు సిద్ధంగా ఉంచిన రూ.3 కోట్లు సీజ్

ప్రాజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలేరు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లకు పంచేందుకు సిద్ధంగా ఓ ఇంట్లో నిల్వ చేసిన రూ. మూడు కోట్లను ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీసులు, ఐటీ అధికారులు కలిసి సీజ్ చేశారు. నగదు నిల్వ చేసిన వారిపై ఖమ్మం రూరల్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ ప్రాజెక్టు మేనేజర్ జగ్గవరపు శ్రీకాంత్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ పొంగులేటి ప్రసాద్ రెడ్డి ఇద్దరు కలిసి గత నెల అక్టోబర్‌లో జగ్గవరపు శ్రీకాంత్ రెడ్డి బంధువయిన ఏదులాపురం పంచాయతీ వరంగల్ క్రాస్ రోడ్‌లోని శ్రీరామ్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న చండు కరుణ ఇంట్లో రూ.మూడు కోట్లు పెట్టారు. పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నియోజకవర్గంలో ఓటర్లకు పంపిణీ చేయడానికి ఉద్దేశించి ఈ నగదు నిల్వ చేసినట్టు తెలుస్తోంది. ఎన్నికలకు రెండు, మూడు రోజుల ముందుగా ఆ నగదు ఓటర్లకు పంచేందుకు నిర్ణయించారు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తమకు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు, ఐటీ అధికారులతో కలిసి చుండు కరుణ ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో రూ. మూడు కోట్లు నగదు పట్టుబడింది. పట్టుబడిన నగదును ఐటీ అధికారులు సీజ్ చేశారు. సంఘటనపై ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి అజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రచారం చేస్తున్న ఎస్ వీరయ్య

ప్రజలందరి సంక్షేమమే కమ్యూనిస్టుల లక్ష్యం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజలందరి సంక్షేమమే లక్ష్యంగా పోరాటాలు చేస్తున్నామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. ఎల్లవేళలా ప్రజల పక్షాన నిలిచే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సోమవారం నల్లగొండ నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి గెలుపు కాంక్షిస్తూ నల్లగొండ పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ బస్టాండ్, రామగిరి, శివాజీనగర్, రవీంద్రనగర్, హైదరాబాద్ రోడ్డు, క్లాక్‌టవర్, ఆర్‌పి రోడ్డు, పాతబస్తీ, దేవరకొండ రోడ్డు, ప్రకాశంబజార్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పేదలకు అండగా నిచిలేది, పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేసేది ఎర్ర జెండా మాత్రమేనని తెలిపారు. పేదలు, బడుగు బలహీన వర్గాలు, మహిళలు, గిరిజన, మైనార్టీల హక్కుల కోసం పోరాడుతున్నదని సిపిఎం మాత్రమే అన్నారు. కాబట్టి, శాసనసభలో ప్రజా సమస్యలపై గళమెత్తి రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీయాలంటే సిపిఎం అభ్యర్థులకు అసెంబ్లీకి పంపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం కొట్లాడటానికి అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర శాసనసభల్లో కమ్యూనిస్టులు లేని లోటు కనిపిస్తుందని, కాంగ్రెస్, బిఆర్‌ఎస్ సభ్యులు స్వార్థప్రయోజనాలకు, కాంట్రాక్టుల కోసం కొట్లాడుతున్నారన్నారు. వారిని ఓడించి సిపిఎం నల్లగొండ నియోజకవర్గ అభ్యర్థి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు సయ్యద్ హాషం, పాలడుగు నాగార్జున, ఎం ప్రభావతి, ఎండి సలీం, నన్నూరి వెంకటరమణారెడ్డి, పుచ్చకాయల నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ప్రమాణం చేయించి డబ్బు పంపిణీ

- పీర్జాదీగూడలో బిఆర్‌ఎస్ నేతల ఎత్తుగడ
- మల్లారెడ్డి కాలేజ్ సిబ్బందిని పట్టుకున్న ఎన్నికల అధికారులు
- డబ్బు తరలిస్తూ పట్టుబడిన పోలీసు అధికారి
- ఓటమి భయంతోనే ప్రలోభాలు : కాంగ్రెస్ పార్టీ నేతలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడానికి బిఆర్‌ఎస్ నేతలు కొత్త ఎత్తుగడలను అవలంభిస్తున్నారు. బిఆర్‌ఎస్ నాయకులు ఓటర్లకు ఒక చేతితో డబ్బు పంపిణీ చేస్తూ మరో చేతితో ఓ మత గ్రంథంపై ప్రమాణం చేయిస్తూ.. పట్టుబడ్డారు. ఈ సంఘటన మేడ్చల్ నియోజకవర్గం పీర్జాదీగూడ కార్పొరేషన్‌లో సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. పీర్జాదీగూడ కార్పొరేషన్ పరిధిలోని తొమ్మిదవ డివిజన్‌లో బిఆర్‌ఎస్ నేతలు, మల్లారెడ్డి కాలేజ్ సిబ్బంది ఓటర్ లిస్టు ఆధారంగా ఓటర్లకు డబ్బు పంపిణీ చేశారు. దాంతోపాటు వారితో బిఆర్‌ఎస్‌కే ఓటు వేస్తామని ఓ మత గ్రంథంపై ప్రమాణం చేయిస్తున్నారని కాంగ్రెస్ నాయకులకు తెలియడంతో ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడికి చేరుకున్న ఎన్నికల అధికారులు, పోలీసులు బిఆర్‌ఎస్ నేతలు, మల్లారెడ్డి కళాశాల సిబ్బంది నుంచి రూ.1.50 లక్షలు, మత గ్రంథం, ఓటర్ల లిస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఓటర్ల వివరాలతో కూడిన మరో లిస్ట్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎఫ్‌ఎస్టీ రాధిక తెలిపారు. అనంతరం పట్టుబడిన నగదు, మల్లారెడ్డి కాలేజ్ సిబ్బందిని అదుపులోకి తీసుకుని మేడిపల్లి పీఎస్‌కు తరలించారు.

రూ.6.50లక్షలు తరలిస్తూ పట్టుబడిన పోలీసు అధికారి

మేడిపల్లి ఎస్వీఎం హోటల్ నుంచి ఓటర్లకు డబ్బు పంపిణీ చేసేందుకు రూ.6.50 లక్షలు కారులో తరలిస్తున్న పోలీసు అధికారిని కాంగ్రెస్ నేతలు అడ్డుకుని మేడిపల్లి చౌరస్తాలోని పోలీసులకు అప్పగించారు. ఆ కారులో పట్టుబడిన నగదును ఎన్నికల అధికారులు, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మల్లారెడ్డిపై చర్యలు తీసుకోవాలి

ఎన్నికల్లో అక్రమ పద్ధతిలో గెలిచేందుకు మల్లారెడ్డి ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నాడని, ఆయనపై ఎన్నికల అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో పీర్జాదీగూడ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలిసిన మల్లారెడ్డి ప్రలోభాలకు తెరదీశారని చెప్పారు. ఇప్పటికైనా మల్లారెడ్డిపై, కాలేజ్ సిబ్బందిపై చర్యలు తీసుకుని ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దర్గా సుధాకర్ రెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి, కవిడే కుమార్, భాస్కర్ బండిరాళ్ల, రంజిత్ రెడ్డి, చింత నరసింహారెడ్డి ఉన్నారు.

మార్పు అంటే ఆరు గంటల కరెంటు ఇవ్వడమా..?

- రైతు బంధును కాటగలిపిన కాంగ్రెస్
- కాంగ్రెస్ హస్తం దరిద్రాలకు నేస్తం..
- తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకే ఓటు వేయాలి
- రోడ్ షోల్లో కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మార్పు కావాలనే నినాదంతో ప్రజల వద్దకు వస్తున్న కాంగ్రెస్ నాయకులు అధికారం వచ్చాక ఆరు గంటల కరెంటు ఇవ్వడమేనా మార్పు అని మంత్రి కెటిఆర్ ప్రశ్నించారు. అధికారంలోకి రాకముందే రైతు బంధును కాటగలిపి రైతుల నోట్లో మట్టిగొట్టారని కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. పొరపాటున వారు అధికారంలోకి వస్తే రైతుబంధును పూర్తిగా ఎత్తేస్తారని ఆరోపించారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా చెన్నూర్, ములుగు, పెద్దపల్లి నియోజకవర్గాల్లో సోమవారం నిర్వహించిన రోడ్ షోల్లో కెటిఆర్ మాట్లాడారు. మార్పు అంటే నిండు కుండలా మారిన చెరువులను ఎండిపోయేలా చేటమేనా.. రైతులకు పెట్టుబడి సాయం కింద అందుతున్న రైతుబంధును ఎగ్గొట్టడమేనా అని ప్రశ్నించారు. 55 ఏళ్లలో 11 సార్లు అధికారం చేపట్టిన కాంగ్రెస్ నాయకులు పదవులు అనుభవించారే కాని ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు. గతంలో రూ.400 ఉన్న గ్యాస్ సిలెండర్ ధరను రూ.1200కు పెంచిన మోడీ సర్కార్ పేదోడి పొట్టగొట్టిందని విమర్శించారు. ప్రజలను మోసం చేసే పార్టీలను నమ్మొద్దని, అధికారం వచ్చాక ఎమ్మెల్యేను కలవాలంటే హైదరాబాద్‌కు బస్సు వేసుకొని పోయే పరిస్థితి వస్తుందని అన్నారు.

ములుగు జిల్లాకు బంగారు భవిష్యత్తు

ములుగు నియోజకవర్గం బిఆర్‌ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతిని ఎమ్మెల్యేగా గెలిపిస్తేనే ములుగు జిల్లాకు బంగారు భవిష్యత్తు ఉంటుందని కెటిఆర్ తెలిపారు. ఎక్కడ సమావేశం జరిగినా పార్టీ అభిమానులు, ప్రజలు కిక్కిరిసిపోతున్నారని ఇదే ఉత్సాహాన్ని ఈనెల 30న జరిగే ఎన్నికల్లోనూ చూపించాలని కోరారు. అధికారంలోకి రాగానే ఏటూరు నాగారంకు బస్సు డిపో, మారుమూల గ్రామాల్లోనూ మోడల్ కాలనీలు, మంగపేట మండలం నుంచి ముల్లకట్ట బ్రిడ్జి వరకు కరకట్ట నిర్మాణం, కొండయి బ్రిడ్జి నిర్మాణం.. తదితర అభివృద్ధి పనులను బిఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్నారు. కెసిఆర్ సిఎం అయ్యాక ములుగులో రెండు రోజులు ఉండి సమస్యలపై దృష్టి పెడతానని హామీ ఇచ్చారు. జనవరి నుంచి కొత్త పింఛన్లు, అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వనున్నట్టు తెలిపారు. పేద కూలీలకు తెల్ల రేషన్ కార్డుపై ఐదు లక్షల జీవిత బీమా ఎల్‌ఐసి ద్వారా అందించనున్నట్టు తెలిపారు. వందేళ్ల పాలనలో ఏ ప్రభుత్వమూ ఇన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు ఇవ్వలేదని, కేవలం బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అమలు చేసిందన్నారు.

రాష్ట్ర భవిష్యత్తుకే ఓటు వేయాలి

ఇప్పుడు జరిగే ఎన్నికలు వ్యక్తుల మధ్య కాదని రాజకీయ పార్టీల మధ్యనే.. మీరు వేసే ఓటు తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు కోసం మంచి మార్పు కోసం వేయాలని కెటిఆర్ అన్నారు. మార్చి పోతే సెప్టెంబర్ అన్నట్టుగా మళ్లీ రాసే పరీక్షలు ఇవి కావని రాష్ట్ర భవిష్యత్తు నిర్ణయించే ఎన్నికలని అన్నారు. సోషల్ మీడియా, ఇతర పద్ధతుల్లో అసత్యప్రచారాలు చేస్తున్న కాంగ్రెస్, బిజెపి మాటలు నమ్మి మోసపోతే రాష్ట్రంలో కరెంట్ కష్టాలు వస్తాయని, కాంగ్రెస్ హస్తం దరిద్రాలకు నేస్తం లాంటిదని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని రైతుబంధు పథకాన్ని సిఎం కెసిఆర్ ప్రవేశపెడితే.. ఇప్పుడు రావాల్సిన డబ్బులను కాంగ్రెస్ కుట్రల వల్ల ఎన్నికల కమిషన్ ఆపేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో అసైన్డ్ భూములు ఉన్నవారికి త్వరలోనే పట్టాలు ఇవ్వనున్నట్టు కెసిఆర్ ప్రకటించారని అన్నారు. రుణమాఫీ కాని కొంతమందికి ఎన్నికల అయిన తర్వాత వడ్డీతో సహా ప్రభుత్వమే చెల్లిస్తుందని అన్నారు.

మోడీ రోడ్ షో.. మెట్రో సేవలకు బ్రేక్!

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ప్రధాని మోడీ హైదరాబాద్‌లో రోడ్ షో సందర్భంగా మెట్రో రైల్ సేవలకు తాత్కాలిక అంతరాయం కలిగింది. సాయంత్రం ఐదు గంటలకు ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ వయా నారాయణగూడ, చిక్కడపల్లి, వైఎంసిఎ నుంచి కాచిగూడ చౌరస్తాలోని వీరసావర్కర్ విగ్రహం వరకు రెండు కిలోమీటర్ల మేర రోడ్ షో కొనసాగింది. ఈ రోడ్ షో సందర్భంగా హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. చిక్కడపల్లి, నారాయణగూడ మెట్రోస్టేషన్లను తాత్కాలికంగా మూసేశారు. ఎంజిబిఎస్-జెబిఎస్ రూట్లో ఆర్‌టిసి క్రాస్ రోడ్డు మెట్రో స్టేషన్ నుంచి సుల్తాన్ బజార్ మెట్రో స్టేషన్ వరకు కట్టుదిట్టమైన బందోబస్తుతో పాటు భద్రతాపరమైన చర్యలు చేపట్టారు. హెచ్‌ఎంఆర్‌ఎల్‌కు సంబంధించిన ఐదుగురు డిఎస్‌పిల ఆధ్వర్యంలో బృందాలు మధ్యాహ్నం మూడు గంటల నుంచి మోడీ రోడ్ షో ముగిసే వరకు సంబంధిత మెట్రో కారిడార్‌లో పోలీస్, ప్రయివేట్ సెక్యూరిటీతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు ఎప్పటికప్పుడూ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించామని హైదరాబాద్ మెట్రో రైల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. ప్రధాని రోడ్ షో సందర్భంగా రాష్ట్ర పోలీసుల కోరిక మేరకు చిక్కడపల్లి, నారాయణగూడ మెట్రో స్టేషన్లను సాయంత్రం 17.45 గంటల నుంచి 18.15 గంటల వరకు, ఆర్‌టిసి క్రాస్ రోడ్ జంక్షన్ వైపు ఆర్‌టిసి మెట్రో స్టేషన్ 16.45 గంటల నుంచి 18.15గంటల పాటు తాత్కాలికంగా మూసివేశామని వివరించారు. ఈ మార్గంలో రెండు స్టేషన్లలో మెట్రో రైళ్లను ఆపకుండా యథావిధిగా సర్వీసులను కొనసాగించినట్టు తెలిపారు.

తడిసిన ధాన్యంపై కవర్లు కప్పిన దృశ్యం

అకాల వర్షంతో తడిసిన ధాన్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం సోమవారం ఉదయం కురిసిన అకాల వర్షానికి తడిసి ముద్దయింది. దిలావర్‌పూర్, ముధోల్ మండలాల్లో ఎండబెట్టిన ధాన్యంపై టార్పలిన్లు కప్పినా.. ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో గాలులకు అవి లేచి పోవడంతో ధాన్యం తడిపోయింది. ధాన్యం కుప్పల్లోకి నీరు చేరి పూర్తిగా తడిసి ముద్దయ్యాయి.

తడిసిన ధాన్యాన్ని రైతులు ఎండబెట్టేందుకు మళ్లీ అష్టకష్టాలు పడ్డారు. తాము పడ్డ శ్రమ రెండితలయ్యిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రైతుల పక్షాన నిలబడే పార్టీ కాంగ్రెస్

- కెసిఆర్ అబద్దాల కోర్
- విజయభేరి సభలో ఎఐసిసి జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'రైతు బంధు విషయంలో ముఖ్యమంత్రి కెసిఆర్ కాంగ్రెస్‌పై చేస్తున్న అసత్య ప్రచారాలని ప్రజలు నమ్మొద్దు. మంత్రి హరీశ్‌రావు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి మాట్లాడటంతోనే ఎన్నికల కమిషన్ రైతుబంధును నిలిపివేసింది. దాన్ని కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తున్నారు. ఈ విషయాన్ని ప్రజలు గ్రహించాలి. రైతుల పక్షాన నిలబడే పార్టీ కాంగ్రెస్' అని ఎఐసిసి జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. సోమవారం మెదక్ జిల్లా శివంపేట మండల పరిధిలోని చిన్న గొట్టిముక్కుల గ్రామ సమీపంలో కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభలో మల్లికార్జున్ ఖర్గే ప్రసంగించారు.

సిఎం కెసిఆర్ అబద్దాల కోర్ అని, ఎన్నికల సమయంలో ప్రజలకు 20 హామీలు ఇచ్చి ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. సంక్షేమ పథకాల పేరుతో సిఎం కెసిఆర్ లక్షల కోట్ల రూపాయలను దోపిడీ చేశారన్నారు. ఇందిరాగాంధీని ఈ ప్రాంతం ప్రజలు మెదక్ ఎంపీగా గెలిపిస్తే ప్రధానమంత్రి అయి ఉమ్మడి మెదక్ జిల్లాలో బిహెచ్ఇఎల్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎంతోమందికి ఉపాధి అవకాశాలు కల్పించి నిరుపేదల బతుకుల్లో వెలుగులు నింపారన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ తొమ్మిది సంవత్సరాల పాలనలో పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా.. ఏ ఒక్కరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం అన్న ముఖ్యమంత్రి కెసిఆర్ మాటలు ఎక్కడ అని ప్రశ్నించారు. ఇందిరాగాంధీనికెసిఆర్ విమర్శించడం సరికాదని, ఆమె కుటుంబానికి చెందిన సోనియాగాంధీ తెలంగాణ ఇవ్వడంతోనే.. కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యారన్నది గుర్తుంచుకోవాలన్నారు.

రాహుల్ గాంధీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేసిన జోడోయాత్రలో ప్రజలను, కార్మికులను, నిరుద్యోగులను ఉద్యోగులతో పాటు అన్ని రంగాల కార్మికులను కలిశారని చెప్పారు. ముఖ్యమంత్రి కెసిఆర్ మాత్రం సామాన్య ప్రజలను కలవకుండా ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. భూ మాఫియాని, ఇసుక మాఫియాని, మైనింగ్ మాఫియాను, లిక్కర్ మాఫియాలను, బడా బాబులను కలుస్తారు తప్ప పేదలను మాత్రం కలవడానికి కెసిఆర్ సమయం ఇవ్వరని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కెసిఆర్ అవినీతిని వెలికి తీస్తామని, కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డిని ప్రజలు గెలిపించాలని కోరారు.

కారును గ్యారేజ్‌కి పంపుదాం

- కాంగ్రెస్, బిఆర్‌ఎస్ కుమ్మక్కయ్యాయి
- సింగరేణి కార్మికులపై పన్ను రద్దు చేస్తాం..
- మంచిర్యాల రోడ్ షోలో అమిత్ షా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెసిఅర్ సర్కార్‌ను మార్చి కారును గ్యారేజ్‌కు పంపే సమయం వచ్చిందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. సోమవారం మంచిర్యాల నియోజకవర్గ బిజెపి అభ్యర్థి ఎర్రబెల్లి రఘునాథ్‌ను గెలిపించాలని అభ్యర్థిస్తూ అమిత్‌షా రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2014, 2018లో కాంగ్రెస్ తరపున గెలిచిన ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి కెసిఆర్ సిఎం అయ్యారని, కాంగ్రెస్, బిఅర్‌ఎస్ మధ్య ఒప్పందం ఉందని తెలిపారు. కాంగ్రెస్ పేరుతో గెలిచిన ఎమ్మెల్యేలు బిఆర్‌ఎస్‌లోకి వెళ్తారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కెసిఆర్‌ను సిఎం చేస్తారని, ఢిల్లీలో రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేస్తారని చెప్పారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో కెసిఆర్ సిఎం, రాహుల్ ప్రధాన మంత్రి అయ్యే అవకాశాలు లేవన్నారు. మళ్లీ మోడీనే ప్రధాన మంత్రి అవుతారని తెలిపారు. కెసిఆర్ ప్రభుత్వం ముస్లిములకు 4శాతం రిజర్వేషన్ ఇచ్చిందని, బిజెపి అధికారంలోకి వస్తే బీసీలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పారు. ఎస్‌సి వర్గీకరణ, బిసి అభ్యర్థిని ముఖ్యమంత్రి చేసి తీరుతామన్నారు. సింగరేణి కార్మికులకు ఇన్‌కమ్ టాక్స్ రద్దు చేస్తామన్నారు. మంచిర్యాల బరిలో ఉన్న ఎర్రబెల్లి రఘునాథ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించి బిజెపిని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు.

హైదరాబాద్‌లో ప్రధాని మోడీ రోడ్‌షో

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బిజెపి అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ రోడ్‌షోను సోమవారం నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్ రోడ్డు నుంచి చిక్కడపల్లి, నారాయణగూడ, వైఎంసిఎ మీదుగా కాచిగూడ క్రాస్‌రోడ్డు వరకు రోడ్‌షో చేపట్టారు.

ప్రధాన వాహనంలో ప్రధాని పక్కన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి, ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ఉన్నారు. గ్రేటర్ పరిధిలో పోటీచేస్తున్న బిజెపి అభ్యర్థులు కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఈ ర్యాలీలో జనసేన, ఎమ్మార్పీఎస్, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు. రోడ్‌షో పొడుగుతా మోడీకి ఆ పార్టీ కార్యకర్తలు స్వాగతం పలికారు. రోడ్‌షో ముషీరాబాద్, ఖైరతాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలను టచ్‌చేసేలా సాగింది. కాచిగూడ చౌరస్తాలోని సావర్కర్ విగ్రహంపై ప్రధాని మోడీ పూలు చల్లి నివాళి అర్పించారు. గ్రేటర్ పరిధిలో పోటీచేస్తున్న బిజెపి అభ్యర్థులు, బిజెపి రాష్ట్ర నాయకులను పలుకరించారు. అనంతరం ఇందిరాపార్కులో నిర్వహిస్తున్న కోటిదీపోత్సవ పరిసమాప్తి కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేతల ప్రదర్శనలు..ప్రజల ఇక్కట్లు..

ముషీరాబాద్ నియోజకవర్గంలో ఒకే రోజు బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు రోడ్‌షోలు, సభలు పెట్టడంతో ఆయా రూట్లలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఉదయం నుంచే హిందీమహా విద్యాలయ-ఇందిరాపార్కు రూట్, సికింద్రాబాద్ టూ కోఠి, సికింద్రాబాద్ టూ బషీర్‌బాగ్, బర్కత్‌పుర నుంచి నారాయణగూడ వెళ్లే రూట్లలో పోలీసులు ఆంక్షలు పెట్టడం, వాహనాలను వెళ్లనీయకపోవడంతో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఉదయం నుంచి పహారాలో ఉన్న పోలీసులు వాహనదారుల ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. చేసేదేమి లేక తమ డ్యూటీకి సహకరించాలని కోరారు.

రాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి ప్రొద్దుటూరు వారి కోర్టులో

ఐ.ఎ.నెం.405/2022, ఓ.ఎస్.నెం.347/2011

కె.నాగేశ్వరమ్మ ...పిటీషనర్/వాది

V/s

1) బి.పొన్నయ్యగారు గతించినందున ఆయన వారసుడు i.e., ప్రపోజుడు డి6
2) యాడికి రామిరెడ్డి & ఇతరులు

..రెస్పాండెంట్స్/ప్రతివాదులు

పై ఐ.ఎ.లో 6వ రెస్పాండెంట్/ప్రపోజుడు డి6 గారికి పత్రికాముఖముగా నోటీసు

బత్తల భీమారావ్ అంబేద్కర్ తండ్రి లేట్ బి.పొన్నయ్య, 8-3-168/ఎం/29, సేర్‌వేల్ హౌసింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ, రిలయన్స్ ఫ్రెష్ ఎదురుగా, యూసఫ్‌గూడ, కైరతాబాద్, హైదరాబాద్, తెలంగాణా స్టేట్ - 500045 అను మిమ్ములను పై దావాలో 6వ ప్రతివాదిగా చేర్చుటకు గాను పై ఐ.ఎ.ను వాదులు సలిపియున్నారు. సదరు ఐ.ఎ. మీ యొక్క హాజరుకు గాను 13.12.2023 వ తేదీకి వాయిదా వున్నది. కావున, సదరు తేదీ 13.12.2023 న ఉ॥ 10.30 గం॥లకు మీరు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ రాజశ్రీ పై కోర్టునందు హాజరై మీకు గల ఆక్షేపణలు / అభ్యంతరాలు ఉన్నయెడల కోర్టు వారికి తెలుపుకోనంతట పై ఐ.ఎ. ను మీ పరోక్షముగా తీర్మానించెదరు.

(రాజశ్రీ కోర్టువారి ఉత్తర్వులు మేరకు)

ఎం.సుధాకర్ బాబ్జీ
వకీలు, కడప

మహారాజశ్రీ రెండవ అడిషనల్ జుడిషియాల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాసు జడ్జి గారి కోర్టు (మొబైల్ కోర్టు), అనంతపురం

Cr.M.P.No.257/2023 in D.V.C.No.54/2017

Between:

వి.సుజాత ...వాది

ఎదిరి

యం.నాగభూషణం మరియు 5 ఇతరులు ...ప్రతివాదులు

1.పొట్టా పార్వతమ్మ W/o పొట్టా శివశంకరరెడ్డి లేట్

R2, R3,R4,R5,వ ప్రతివాదులకు నోటీసు

R2:యం.శివప్రసాద్ తండ్రి రుద్రప్ప, వయస్సు 61 సం॥లు, డోర్ నెం:4-1484, నియర్ ఆంజినేయస్వామి గుడి, పాపంపేట, అనంతపురం మండలం మరియు జల్లా.

R3:సింగిడి సరస్వతి @ సరస్వతి, W/o విజయ్ మోహన్, హిందూ, వయస్సు 62 సం॥లు, డోర్ నెం:3/117, యస్.సి.కాలనీ, వి.కొత్తకోట విలేజ్, విడపనకల్ మండలం, అనంతపురం జల్లా.

R4:భువనేశ్వరి W/o ఎన్.రంగస్వామి, హిందూ, వయస్సు 62 సం॥లు, R/o గణేష్ నగర్ పాపంపేట, అనంతపురం మండలం మరియు జల్లా.

R5:పి.లక్ష్మిదేవి @ ధనలక్ష్మి, W/o T.V. దేవదత్, హిందూ, వయస్సు 62 సం॥లు, డోర్ నెం:1-10-249-2-4, అశోక్ నగర్ ఎక్స్టెన్షన్, బ్యాక్ సైడ్ ఆఫ్ సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్, హైదరాబాద్.

ఇందుమూలంగా ప్రతివాదులు అయిన మీకు తెలియజేయడమేమనగా పై కోర్టు వారు పై కేసులో మీకు పలు మార్లు నోటీసులు పంపిననూ చురనందున ఈ ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయమని ఆదేశించి పై కేసును 15/12/2023వ తేదికి మీ హాజరు నిమిత్తం వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరి తేదినాడు ఉదయం 10:30 గం॥లకు ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనంతట పై కేసు మీ రోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

వాయిదా తేది:15/12/2023

(కోర్టు వారి ఆదేశాల మేరకు)

శ్రీ.పి.నరసింహుడు,
శ్రీమతి వి.యల్.కామేశ్వరి,
వాదిపరం న్యాయవాదులు, అనంతపురం

బిఆర్ఎస్, బిజెపిల చిన్నతమ్ముడు ఎంఐఎం

- ఫామ్‌హౌస్ పాలన వద్దు.. ప్రజా పాలన రావాలి
- ఎఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ

రోడ్ షోల్లో ప్రసంగిస్తున్న ప్రియాంక గాంధీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"బిఆర్ఎస్, బిజెపిల చిన్నతమ్ముడు ఎంఐఎం.. ఆ దోస్తానితోనే ఎంఐఎం తొమ్మిది సీట్లలోనే పోటీ చేసింది.. ఫామ్‌హౌస్ పాలన మన కొద్దు.. ప్రజా పాలన కావాలి.. భూములను కబ్జా చేసే బిఆర్ఎస్‌ను ఓడించాలి.. లౌకిక దారుల్లో నడిచే కాంగ్రెస్‌ను గెలిపించండి" అని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ అన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గద్వాల, కోస్గి నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన కాంగ్రెస్ అభ్యర్థుల ఎన్నికల ప్రచార సభలు, రోడ్‌షోల్లో ప్రియాంకగాంధీ ప్రసంగించారు.

భువనగిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రియాంక మాట్లాడుతూ.. రెండుసార్లు అధికారం ఇస్తే బిఆర్ఎస్ ఏం చేసిందని ప్రశ్నించారు. ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని, అవినీతి ఆకాశాన్నంటిందని చెప్పారు. మహిళలపై లైంగికదాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత చిరు, మధ్యతరగతి వ్యాపారులు అనేక అవస్థలు పడ్డారని తెలిపారు. యువజనుల ఆశలు నెరవేరేలేదని, వారి కలలు సాకారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వం వస్తే భూ మాఫియా పెరిగిపోతుందని చెప్పారు. కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా, రింగ్ రోడ్డు వేలంపాట ద్వారా అవినీతికి శ్రీకారం చుట్టారని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని కోరారు. రాహుల్ గాంధీపై ఎంఐఎం నేతలు తల తిక్క ఆరోపణలు చేస్తున్నారని, కానీ, రాహుల్ ప్రజల్లో ఒక శక్తిగా ఎదిగారని చెప్పారు. దేశ ప్రజల ఆశీస్సులు ఉన్నత వరకు ఆయన్ని ఎవరూ ఏమీ చేయలేరన్నారు.

లౌకిక పార్టీ కాంగ్రెస్‌ను గెలిపించండి

కులమతాలకతీతంగా పరిపాలన అందించే కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రియాంక గాంధీ పిలుపునిచ్చారు. గద్వాల, కోస్గి నియోజకవర్గ కేంద్రాల్లో ఎన్నికల ప్రచారంలో ఆమె ప్రసంగించారు. ప్రాజెక్టులలో అవినీతి, కమీషన్లు పరాకాష్టకు చేరడం వల్లే నాసిరకమైన పనులతో కాళేశ్వరం కుంగిపోయిందన్నారు. ప్రధాని మోడీ పేదల భూములను, డబ్బును అదానీ వంటి పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. దేశ ప్రజలకు మోడీ పాలనలో ఉపాధి కరువైందన్నారు. ఎన్నికలకు ముందు మాయ మాటలు చెప్పే నాయకులను తిరస్కరించాలని ఆమె ఓటర్లను కోరారు. తెలంగాణలో ఆరో గ్యారంటీ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్‌కు ఎవరూ సాటిరారన్నారు. కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిజెపి, బిఆర్ఎస్, ఎంఐఎంను ఓడించండి

- సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికల్లో మతోన్మాద, ఫాసిస్టు బిజెపి, దానికి తోడుగా ఉన్న బిఆర్ఎస్, ఎంఐఎంలను ఓడించాలని సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఫాసిస్టు వ్యతిరేక శక్తులను గెలిపించాలని కోరింది. ఈ మేరకు ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హిట్లర్ తరహాలో జాతి విద్వేషాన్ని రెచ్చగొడుతూ మతోన్మాద రాజ్య స్థాపనకు, బడా కార్పొరేట్ శక్తుల ఏకపక్ష ఆధిపత్యానికి బిజెపి పూనుకుంటున్నదని విమర్శించారు. ఆ పార్టీ ఫాసిస్టు పోకడలను బిఆర్ఎస్ బలపరుస్తూ లోక్‌సభలో అండగా ఉంటున్నదని తెలిపారు. బిజెపితో బిఆర్ఎస్, ఎంఐఎం రహస్య ఒప్పందం చేసుకుని క్విడ్‌ప్రోకో పద్ధతిని అనుసరిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కూటమి దేశానికి ప్రమాదకరమని తెలిపారు. నయా హిట్లరిస్ట్, అభినవ రజాకారు నిజాం కూటమి అని విమర్శించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ప్రజాస్వామ్యయుతంగా ఆలోచించి లౌకిక, ప్రజాస్వామిక, పౌరహక్కులను కాపాడ్డానికి, ఫాసిజం రాకుండా అడ్డుకోవడానికి ఆలోచించాలని కోరారు. ప్రలోభాలు, ప్రభావాలు, విద్వేషాలకు లోనుకాకుండా ఓటేయాలని కోరారు. కొత్తగూడెంలో సిపిఐకి మద్దతునిస్తున్నామని తెలిపారు.

నేడు సిఎం సభలో కోడి కత్తి రిపీట్ కాబోతుంది

- ప్రజల సానుభూతి కోసం కెసిఆర్ డ్రామా
- గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి నర్సారెడ్డి కీలక వ్యాఖ్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 28న గజ్వేల్‌లో జరిగే ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రచార సభలో కోడి కత్తి డ్రామా రిపీట్ చేయాలని ప్రయత్నం చేస్తున్నారని గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి తూముకుంట నర్సారెడ్డి అన్నారు. తన ఇంటికి భద్రత కల్పించాలని ఈ సందర్భంగా పోలీసులను కోరారు. సోమవారం సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన గజ్వేల్‌లో ఆయన తన ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంగళవారం గజ్వేల్‌లో జరిగే సిఎం సభలో వారే అల్లర్లు సృష్టించుకొని కాంగ్రెస్‌పై నెట్టే అవకాశం ఉందని అన్నారు. దుబ్బాకలో ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డిపై జరిగిన కత్తిపోట్ల దాడి కాంగ్రెస్ పని అని కెసిఆర్ ఇప్పటికే ప్రకటించారన్నారు. పోలీస్ శాఖ మాత్రం కాంగ్రెస్ చేసింది కాదని తేల్చిందని చెప్పారు. కాంగ్రెస్‌కు రక్త చరిత్ర ఉందని కెసిఆర్ చెప్పడం సిగ్గుచేటన్నారు. 1200 మంది అమరవీరుల కుటుంబాల పుణ్యమా అని సిఎం కుర్చీలో కూర్చున్న కెసిఆర్‌కు కాంగ్రెస్ రక్త చరిత్ర గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. గజ్వేల్‌తో పాటు కామారెడ్డిలో ఆయనకు ఓటమి తప్పదని చెప్పారు. డిసెంబర్ మూడున కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని సమాచారం తెలుసుకున్న కెసిఆర్ ప్రజల సానుభూతి పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఆయనకు ప్రజల సానుభూతి కాదు కదా ఆయనను సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ ప్రచార రథాలను 40 గ్రామాల్లో ప్రజలు రానివ్వలేదని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లారెడ్డి, సర్దార్ ఖాన్, నాగరాజు, అంజా గౌడ్ తదితరులు ఉన్నారు.

పిల్లల్లో ప్రతిభ గుర్తించి ప్రోత్సహించాలి

- జస్టిస్ రామలింగేశ్వర రావు

ప్రజాశక్తి - కల్చరల్

తల్లిదండ్రులు పిల్లలలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరముదని సమైక్య ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎస్ రామలింగేశ్వరరావు అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై ఆదివారం కమలాకర లలిత కళా భారతి, కమలాకర సంగీత నృత్య క్షేత్రం నిర్వహణలో బాలరత్న పురస్కార ప్రదానం జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ రామలింగేశ్వర రావు పాల్గొని వివిధ రంగాలలో ప్రతిభావంతులైన బాలలకు బాల రత్న పురస్కారాలు బహూకరించి మాట్లాడారు. తెలుగు సంస్కృతిని కాపాడడంలో బాలలు ముందు ఉండాలనీ వారే దేశ భవిష్యత్ నిర్ణేతలు అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిష్టర్ ఆచార్య టి గౌరీ శంకర్ మాట్లాడుతూ పిల్లలకు బహుమతులు ఆక్సిజన్ వంటివి అన్నారు. బిసి కమిషన్ చైర్మన్ డాక్టర్ వాకులాభరణం కృష్ణ మోహన రావు రచయిత్రి డాక్టర్ కృష్ణ కుమారి, కవయిత్రి శశీ బాల తదితరులు పాల్గొన్నారు.

హరీశ్ రావు వల్లే రైతుబంధు ఆగింది

- డోర్నకల్ ప్రచార సభలో రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతు బంధును అడ్డుపెట్టుకొని ఎన్నికల్లో లబ్ది పొందాలని మామ, అల్లుడు చూస్తే.. ఎన్నికల కమిషన్ స్పందించి దాన్ని నిలిపివేసిందని, కాంగ్రెస్ ఫిర్యాదు వల్లే రైతుబంధు ఆగిపోయిందని హరీశ్‌రావు, కెసిఆర్ ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని టిపిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గంలోని మరిపెడ మండల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార సభలో రేవంత్ మాట్లాడారు. రైతుబంధు ఇవ్వాలనుకున్నప్పుడు.. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ఇవ్వొచ్చు కదా అని కెసిఆర్‌ను ప్రశ్నించారు. 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కి తెలంగాణ రైతులు ఓట్లు వేసి గెలిపిస్తే డిసెంబరు 9 తర్వాత ప్రతి రైతు ఎకౌంట్‌లో రైతుబంధు సాయం కింద రూ.15 వేలు అందిస్తామని తెలిపారు. ఉద్యోగ నోటిఫికేషన్లు వేయకుండా వేసినా వాటిలో లొసుగులతో రెండు లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో అడ్డుకుంటున్న అసలైన దొంగ కెసిఆర్ అని విమర్శించారు. ఈ రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలని, మీ భవిష్యత్తును మీరే కాపాడుకోవాలని యువకులను కోరారు. కెసిఆర్ కుటుంబ పాలన, డోర్నకల్‌లో రెడ్యా నాయక్ అవినీతి పాలనను అంతమొందించాలని, వచ్చే ఎన్నికల్లో డాక్టర్ రామచంద్రనాయక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డోర్నకల్, మహబూబాబాద్ అభ్యర్థులు డాక్టర్లు రామచంద్రనాయక్, మురళి నాయక్, మాజీ కేంద్రమంత్రి బలరాం నాయక్, మాజీ ఎంపీ సురేందర్ రెడ్డి, డిసిసి జిల్లా అధ్యక్షులు జన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి కృష్ణారెడ్డి, జిల్లా నాయకులు వెన్నం శ్రీకాంత్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారధి, నాయకులు నల్లు సుధాకర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు రాధాబాయి, మహలోతు నెహ్రూ నాయక్ తదితరులు పాల్గొన్నారు. జరిగింది.

కొండపోచమ్మ కాల్వలో పడి ఇద్దరు మృతి

- మర్కుక్‌లో పండగ పూట విషాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రమాదవశాత్తు కొండపోచమ్మ ప్రాజెక్టు కాల్వలో పడి ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా మర్కుక్‌లో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. మర్కుక్ ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం పాఠశాలకు సెలవు దినం కావడంతో మర్కుక్ గ్రామానికి చెందిన చల్లా సంపత్(13), మైసిగారి వినయ్(12), అచ్చంగారి రాజు.. ముగ్గురూ కలిసి ఉదయం కొండపోచమ్మ ప్రాజెక్టు వైపు వాకింగ్‌కు వెళ్లారు. అనంతరం ప్రాజెక్టు సంపుహౌజ్ కాల్వ వద్ద కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లగా.. సంపత్, వినయ్ కాలు జారి కాల్వలో పడిపోయారు. కాల్వ గట్టు మీద ఉన్న రాజు ఇది గమనించి కాపాడటానికి ప్రయత్నం చేయగా.. అప్పటికే ఇద్దరూ నీట మునిగిపోయారు. దాంతో పరుగెత్తుకుంటూ గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. గజ్వేల్ ఎసిపి రమేష్, మర్కుక్ ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గ్రామస్తులు, గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మర్కుక్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ ఏడాది 6.4 శాతం వృద్ధి

- ఎస్అండ్‌పి అంచనా

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 6.4 శాతంగా ఉండొచ్చని ఎస్అండ్‌పి గ్లోబల్ రేటింగ్స్ అంచనా వేసింది. ఇంతక్రితం 6 శాతం అంచనాతో పోల్చితే 40 బేసిస్ పాయింట్లు పెంచింది. కాగా.. 2024-25 జిడిపి అంచనాలకు 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టి.. 6.4 శాతంగా అంచనా వేసింది. అధిక ద్రవ్యోల్బణం, బలహీన ఎగుమతులు చోటు చేసుకున్నప్పటికీ దేశీయ డిమాండ్ పెరుగుదలతో ఈ ఏడాది జిడిపికి మద్దతు లభించనుందని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ప్రపంచ వృద్ధిలో రేటులో మందగమనం చోటు చేసుకోవచ్చని పేర్కొంది. ఇందుకు అధిక వడ్డీ రేట్లు, భౌగోళిక ఆందోళనలు కారణమని పేర్కొంది. కాగా 2025-26లో భారత జిడిపి 6.9 శాతం పెరుగొచ్చని పేర్కొంది.

'ఢిల్లీ' మిడతల దండు పని పట్టాలి

- రైతుబంధు ఆపిన కాంగ్రెస్ మనకు అవసరమా..?
- శాంతిసామరస్యాలను చెడగొడుతున్న బిజెపి
- బుల్డోజర్లు కాదు.. పొలాల్లో ట్రాక్టర్లు, హార్వెస్టర్లు నడవాలి
- ఎమ్మెల్సీ కవిత

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"పంటలు చేతికొచ్చే సమయంలో మిడతల దండు వచ్చినట్టు.. ఐదారు రోజులుగా ఢిల్లీ నుంచి బిజెపి, కాంగ్రెస్ అగ్రనేతలు తెలంగాణపై పడుతున్నారు.. ఓట్లతో ఆ మిడతల దండు పని పట్టాలి" అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన నాడు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ ఎక్కడున్నారని ప్రశ్నించారు. రాష్ట్రం వచ్చిన తర్వాత పార్ల మెంటులో కాంగ్రెస్ నాయకులు ఆంధ్రా హక్కుల గురించి మాట్లాడారే కానీ తెలంగాణ హక్కు గురించి మాట్లాడలేదని తెలి పారు. తెలంగాణలోని ఏడు మండలా లను అప్రజాస్వామికంగా ఆంధ్రలో కలిపినప్పుడు, కేంద్రం విభజన హామీలను అమలు చేయకపోతే కాంగ్రెస్ నాయకులకు మాట్లాడటానికి నోరు రాలేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటును అవహేళన చేస్తూ పార్లమెంటులో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మాట్లాడినప్పుడు సోనియా గాంధీ అక్కడే ఉన్నా అభ్యంతరం చెప్పలేదని గుర్తు చేశారు. బిజెపి అబద్ధాలు చెప్పడం తప్ప ఒక్కసారైనా నిజం చెప్ప లేదని విమర్శించారు. తెలంగాణలో శాంతిసామరస్యాలను పాడుచేయడానికి ఆ పార్టీ నాయకులు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరు భాగ్యలక్ష్మి దేవాలయం అంటారు.. మరొకరు భైంసాకు వెళ్లి ఏదో చేస్తామంటారు.. కానీ మనకు భరోసా, భద్రత ఇచ్చేలా, అస్థిత్వాన్ని కాపాడటానికి ఏనాడూ బిజెపి ప్రయత్నం చేయలేదని అన్నారు. మనం కష్టాల్లో ఉన్నప్పుడు పట్టించుకోని నాయకులు, పార్లమెంటులో పెదవి విప్పని నాయకులు, అవసరమున్నప్పుడు తెలంగాణకు నయాపైసా ఇవ్వని వాళ్లు మనకు అవసరమా అన్నది ఆలోచించాలని ఓటర్లను కోరారు. మతం పేరు చెప్పి మంటలు పెట్టాలని ఒక పార్టీ చూస్తోందని, మరొక పార్టీ కులం పేరు చెప్పి కుతంత్రం చేసే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు.

తెలంగాణలో శాంతి భద్రతలకు విఘాతం కలిగితే.. ముస్లిములకు ఎంత నష్టం జరుగుతుందో.. హిందువులకూ అందే నష్టం జరుగుతుందని చెప్పారు. ఈ ఆలోచన లేక కొన్ని పార్టీలు ప్రజల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నాయని విమర్శించారు. మంచోళ్లు కావాలా ముంచేటోళ్లు కావాలా అన్నది తేల్చుకునే సందర్భం వచ్చిందన్నారు. రైతుబంధు నిధులను కాంగ్రెస్ పార్టీ వెంటబడి మరీ నిలిపివేయించిందని, రైతుల నోటి కాడి బుక్కను లాక్కొని ఆ పార్టీ రైతు వ్యతిరేకతను చాటుకుందని అన్నారు.

ఉత్తరప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్.. తెలంగాణలో బుల్డోజర్ నడపాల్సిన సమయం వచ్చిందని అంటున్నారని, వెయ్యి బుల్డోజర్లు నడిపినా వాటిపై దాడి చేయడానికి కారు సిద్ధంగా ఉందని హెచ్చరించారు. "బుల్డోజర్లు నడపడం మా ఆలోచన కాదు. పొలాల్లో ట్రాక్టర్లు, హార్వెస్టర్లు నడవాలన్నదే మా ఆలోచన. సాగు, తాగు నీళ్లు అందించాలన్నది, పిల్లలకు ఉద్యోగాలు కల్పించాలన్నది మా ఆలోచన. మీ లాగా ఇళ్లను కూల్చేయడం కాదు.. ఇళ్లు నిర్మించడం మా ఆలోచన" అని చెప్పారు.

నిరుద్యోగులను మోసగించిన కెసిఆర్

- సచిన్ పైలట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిరుద్యోగులను సిఎం కెసిఆర్ మోసం చేశారని కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు సచిన్ పైలట్ విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన నిరుద్యోగులతో ఇష్టాగోష్టిలో పాల్గొన్నా రు. అనంతరం మీడియా సమావేశం లో పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ఎన్నో ఆశలతో ఆవిర్భవించిన తెలంగాణ లో నిరుద్యోగుల జీవితాలను బిఆర్ఎస్ చిదిమే సిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియామకాలు జరపలేదనీ, నోటిఫి కేషన్లు ఇచ్చినా పరీక్షలను సరిగ్గా నిర్వహించలేదనీ, ఐదేండ్లు గడిచినా నిరుద్యోగ భృతి హామీని నిల బెట్టుకోలేదని విమర్శించారు. పదేండ్ల తర్వాత సిఎం కెసిఆర్ మళ్లీ అవే సమస్యలను పరిష్కరిస్తానంటూ రావడం హాస్యాస్పదమన్నా రు. కర్ణాటక కార్మిక శాఖ మంత్రి సంతోష్ ఎస్.లాడ్ మాట్లాడుతూ తాము గిగా వర్కర్ల (స్విగ్గీ తదితర ఆన్ లైన్ ప్లాట్ ఫాంలలో పని చేసే వారు) కోసం ఇచ్చిన గ్యారంటీని అమలు చేస్తున్నట్టు తెలిపారు. 50 లక్షల మంది దీంతో వైద్య, బీమా తదితర సౌకర్యాలు పొందుతున్నా రని తెలిపారు.

జాక్ మా కొత్త కంపెనీ 'మా కిచెన్ ఫుడ్'

బీజింగ్ : చైనాకు చెందిన వ్యాపారవేత్త జాక్ వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెస్ చేసి విక్రయించే కొత్త కంపెనీని ప్రారంభించారు. 'హాంగ్జా మా కిచెన్ ఫుడ్ పేరుతో దీన్ని ఏర్పాటు చేశారు. 1.4 మిలియన్ డాలర్ల మూలధనంతో దీన్ని రిజిస్టర్ చేయించారని రిపోర్టులు వస్తున్నాయి. ప్యాకేజ్డ్ వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించనున్నారు. ప్రధానంగా రెడీ టు ఈట్ మీల్స్ విభాగంలో ప్రవేశిస్తున్నారని సమాచారం.

టిసిఎస్‌కు అమెరికన్ కోర్టు భారీ జరిమానా

న్యూయార్క్: దిగ్గజ టెక్ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్)కు అమెరికన్ కోర్టులు వరుస షాక్‌లు ఇస్తున్నాయి. అక్కడి చట్టాలను అతిక్రమించడంతో తాజాగా అమెరికా డల్లాస్ కోర్టు 210 మిలియన్లను స్థానిక సంస్థ డిఎక్స్‌సి టెక్నాలజీకి వెంటనే చెల్లించాలని ఆదేశించింది. వారం క్రితం మరో కేసులో ఎపిక్ సిస్టమ్‌కు 140 మిలియన్ డాలర్ల జరిమానా చెల్లించాలని అమెరికా సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వారం వ్యవధిలోనే ఈ రెండు తీర్పులు టిసిఎస్‌ను ఆందోళనకు గురి చేస్తున్నాయి. టిసిఎస్ అమెరికా చట్టాలను అతిక్రమించి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తుందని.. మేధో సంపత్తిని తస్కరించడం, చేసుకున్న ఒప్పందాలను మధ్యలోనే రద్దు చేసుకోవడం తదితర నిబంధనలు అతిక్రమి స్తుందని టిసిఎస్‌తో ఒప్పందం చేసుకున్న అక్కడి సంస్థల ప్రధాన అరోపణ.

కుంభకోణాల పార్టీకి బుద్ధి చెప్పాలి

- బిజెపి జాతీయ అధ్యక్షులు నడ్డా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు కుటుంబ, కుంభకోణాల పార్టీలని, ఓటుతో ఆయా పార్టీలకు బుద్ధిచెప్పాలని బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం ఎంతో పురోగతి సాధిస్తున్నట్టు వెల్లడించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం కామారెడ్డి జిల్లా జుక్కల్, నిజామాబాద్ జిల్లా బోధన్‌లో బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభల్లో పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ అనేక రకాల అవినీతి అక్రమాలకు పాల్పడుతూ కుంభకోణాలకు పాల్పడ్డాయని, ఇలాంటి పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం మూడు పార్టీలూ ఒకటేనని, ఆ పార్టీలను నమ్మితే ప్రజలు మళ్లీ మోసపోతారని తెలిపారు. ఈ ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి తీసుకురావాలని, జుక్కల్ నుంచి అరుణతారను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తే 2.50 లక్షల ఉద్యోగాలు వెంటనే భర్తీ చేస్తామని, మేనిఫెస్టోను అమలు పరుస్తామని తెలిపారు.

బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తాం

రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే బోధన్‌లోని నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని నడ్డా హామీ ఇచ్చారు. బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొని మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని, ఆ ప్రాజెక్టు కెసిఆర్‌కు ఎటిఎంలా మారిందని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్‌ను రద్దుచేసి నిరుపేదల భూములకు రక్షణ కల్పిస్తామన్నారు. ఔటర్ రింగ్ రోడ్‌లో వెయ్యి కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. దళితబంధు పథకంలో అవినీతి జరిగిందని స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఒప్పుకున్నారన్నారు. ప్రధాని మోడీ హయాంలో దేశం పురోగతి చెందిందని తెలిపారు. తెలంగాణలో ఏ ఒక్కరికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు రాలేదని, నిరుద్యోగులకు ఉద్యోగాలు రాలేదని విమర్శించారు. సభలో బిజెపి బోధన్ అభ్యర్థి వడ్డీ మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు బస్వలక్ష్మీ నరసయ్య, రాష్ట్ర నాయకులు మేడపాటి ప్రకాశ్ రెడ్డి, అడ్లూరి శ్రీనివాస్, నరసింహా రెడ్డి, జిల్లా నాయకులు సుధాకర్ చారి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కెసిఆర్ ఇందిరమ్మ అనుచరుడే

- మన్మోహన్ సర్కార్‌లో మంత్రి కూడా
- పదేళ్లలో ఏమి చేశారో చెప్పాలి?
- కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇందిరమ్మ పరిపాలించిన కాలంలో సమయంలో ఆమె అనుచరుల్లో కెసిఆర్ కూడా ఒకరని కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్ గుర్తుచేశారు. అదే విధంగా యుపిఎ ప్రభుత్వం ప్రధాని మన్మోహన్ మంత్రివర్గంలో కెసిఆర్ మంత్రిగా పని చేశారని తెలిపారు. బిఆర్ఎస్ నాయకులు అవన్నీ మరిచిపోయి ఇందిరమ్మ రాజ్యమంటే... కాంగ్రెస్ ప్రభుత్వమంటే అంటూ విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సోమవారం హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పదే దేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఏమి చేశారో చెప్పాలని అడిగితే, ఐదు నెలల కర్ణాటక కాంగ్రెస్ పాలనపై చెప్పాలని కోరడం ఏంటని ప్రశ్నించారు. బిఆర్ఎస్ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో విఫలమయినందునే దృష్టి మళ్లించే ప్రయత్నాలు చేస్తూ, సెంటిమెంట్ మళ్లీ మళ్లీ రగిల్చే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. అభివృద్ధి, ఉపాధి కల్పన, సామాజిక న్యాయం చేయని బిఆర్ఎస్ ఎన్నికల ఎజెండా అంశాన్ని మారుస్తున్నదని తెలిపారు. ఇలాంటి దృష్టి మళ్లించే విద్యలో సిఎం కెసిఆర్, ప్రధాని నరేంద్రమోడీ ఇద్దరూ ఒక్కటేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలను విమర్శించే కెసిఆర్ ఆ రాష్ట్రాలకు వెళ్లి చూడాలని సూచించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన గ్యారంటీలన్నింటినీ అమలు చేస్తున్నట్టు తెలిపారు.

తెలంగాణ ఏర్పాటు సమయంలోనూ యుపిఎ వేసిన మంత్రుల కమిటీకి బిఆర్ఎస్ (నాటి టిఆర్ఎస్) ఎలాంటి సూచనలు చేయలేదని తెలిపారు. పార్లమెంటు బిల్లు ఆమోదం పొందే సమయంలో ఆ పార్టీ ఎంపిలు హాజరు కాలేదన్నారు. విభజన హామీల కోసం ఏనాడూ బిఆర్ఎస్... బిజెపిని నిలదీయలేదనీ, పట్టుపట్టలేదని తెలిపారు. విభజన హామీల్లో ఇబ్బందులుంటే వాటి సవరణల కోసం పార్లమెంటులో ప్రయత్నం చేయలేదని విమర్శించారు. హైదరాబాద్‌తో కూడిన తెలంగాణను ధనిక రాష్ట్రంగా ఇస్తే అభివృద్ధిని అన్ని జిల్లాలకు, సంక్షేమాన్ని అన్ని వర్గాలకు అందించడంలో బిఆర్ఎస్ ఘోరంగా విఫలమైందని తెలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎన్నికల ముందు ప్రకటించే సంస్కృతి కాంగ్రెస్‌కు లేదని స్పష్టం చేశారు. పదిమంది సిఎం అభ్యర్థులుండటం తమ పార్టీ బలాన్ని సూచిస్తోందని తెలిపారు.

ఉద్దేశపూర్వకంగానే హరీశ్ వ్యాఖ్యలు

రైతుబంధుకు సంబంధించి సిఎం కెసిఆర్ డైరెక్షన్‌లో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ఈ ఎన్నికల్లో గెలిచేందుకు బిజెపి, బిఆర్ఎస్ కలిసి ఆడిన డ్రామా అని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రజలను నమ్మకద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌కు వికలాంగుల మద్దతు

- తెలంగాణ వికలాంగుల జెఎసి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో తెలంగాణ వికలాంగుల జెఎసి కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని ఆ సంఘాల జెఎసి కన్వీనర్ నార నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వికలాంగుల జనాభా సుమారు 20 లక్షలుగా ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగుల సంక్షేమం, అభివృద్ధి, ఆత్మ గౌరవం, సాధికారతకోసం పనిచేస్తున్నట్టు హామీ ప్రకటించిందని చెప్పారు. తమ సమస్యల పరిష్కారానికి భరోసానిస్తూ మ్యానిఫెస్టోలో ఆయా అంశాలు చేర్చారని గుర్తు చేశారు. సమావేశంలో ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ చైర్మన్, యం. గంగారామ్, ఆదర్శ వికలాంగుల సంఘం అధ్యక్షులు ఎన్ మల్లారెడ్డి, బధిరుల అభివృద్ధి సంఘం అధ్యక్షులు ప్రసాద్, భారతి, మహిళాసాధికారత సంఘం అధ్యక్షులు కె రాజ్యలక్ష్మి, వికలాంగుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు ఘంటా సత్యనారాయణ రెడ్డి వికలాంగుల రాష్ట్ర సాంస్కృతిక సంఘం అధ్యక్షులు జి వెంకట్, నిరుద్యోగుల వికలాంగుల సంఘ సభ్యులు వెంకటేశ్, ఐక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను ఆదరించండి

- దేశవ్యాప్తంగా ప్రజలు మార్పు కోరుకుంటున్నారు
- కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని సీనియర్ ఐఎన్‌టియుసి నాయకులు మాజీ ఎంపి సర్వే సత్యనారాయణ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, తెలంగాణతో పాటు దేశంలో కాంగ్రెస్ పార్టీ డబుల్ ఇంజిన్ సర్కార్ అధికారంలోకి రానుందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల దేశంలో పబ్లిక్ రంగ సంస్థలు మూతపడుతున్నాయని ఆరోపించారు. లాభాల్లో ఉన్న అనేక ఫ్యాక్టరీలను గంపగుత్తన తన కార్పొరేట్ మిత్రులకు కట్టబెట్టేదుంకు మోడీ కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు.

కెసిఆర్ పాలనలో కార్మికుల హక్కులు, సంక్షేమం, భద్రత లేకుండా పోయాయని అయన ఆందోళన వ్యక్తం చేశారు. .గత కాంగ్రెస్ పాలనలో వేతనాలు పెరగడంతోపాటు ఉద్యోగభద్రత ఉండేదని, పెన్షన్ విధానమూ సక్రమంగా అమలు చేసేదని అయన గుర్తు చేసారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని కార్మికవర్గానికి సర్వే సత్యనారాయణ పిలుపునిచ్చారు.